క్లుప్తంగా

ఎంపీడీఓ ఆంజనేయులుకు సన్మానం



ఎంపీడీఓకు చిత్రపటం అందజేస్తున్న లక్ష్మణ్

కొందుర్గు: ఉత్తమ అవార్డు గ్రహీత ఎంపీడీఓ ఆంజనేయులును గురువారం కొందుర్గు మండల టీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. నీతి నిజాయితీలతో బాధ్యతలు నిర్వర్తిస్తూ అందరి మన్ననలను అందుకుంటున్న ఎంపీడీఓ ఆంజనేయులుకు అవార్డు రావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా కొందుర్గు గ్రామానికి చెందిన చిత్రకారుడు దుర్గని లక్ష్మణ్ గీసిన ఎంపీడీఓ ఆంజనేయులు ఫొటోను ఆయనకే జ్ఞాపికగా అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సుందర్, భీమసేన, రాజు, శ్రీను, శ్యామ్, పవన్, బాల్‌రాజ్, సైఫ్, కృష్ణయ్య, సత్యనారాయణ, వెంకటయ్య, శేఖర్, పాల్గొన్నారు.

కాలుష్య పరిశ్రమలపై చర్యలు తీసుకోండి

కొత్తూరు: మండలకేంద్రం సమీపంలోని పారిశ్రామికవాడలో కాలుష్య నియంత్రణ పాటించకుండా కొనసాగుతున్న పరిశ్రమలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ మండల కార్యదర్శి షకీల్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. లెడ్ బట్టీలు, పాత టైర్లను కాల్చే పరిశ్రమల నుంచి రాత్రి వేళల్లో ఘాటైన వాయు కాలుష్యం వెలువడుతుందన్నారు. వీటి నిర్వాహకులు సరైన అనుమతులు కూడా పొందకుండా కొందరు నాయకులు, అధికారులకు ముడుపులు చెల్లిస్తూ యథేచ్ఛగా వ్యాపారం సాగిస్తున్నట్లు ఆరోపించారు. ఇప్పటికైనా పీసీబీ, రెవెన్యూ అధికారులు స్పందించి కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలను గుర్తించి వాటిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

వెయ్యి గజాల ప్రభుత్వ స్థలం స్వాధీనం



మున్సిపల్ స్థలంగా బోర్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని 10వ వార్డుల్లో ప్రభుత్వ భూమిలో గ్రామస్తులు ఏళ్ల తరబడి పశుల వ్యర్థాలను వేసుకునే వారు. కొద్ది మంది అక్రమార్కులు చదును చేసి తమ స్థలంగా చెప్పడంతో గురువారం శంకర్‌పల్లి మున్సిపల్ అధికారులు శుభ్రం చేయించి మున్సిపాలిటీ పరిధిలోకి స్వాధీనం చేసుకున్నారు. ఖాళీ స్థలం 1000గజాలకు పైగా ఉంటుందని, మున్సిపాలిటీకి చెందిన భూమిగా బోర్డులను కూడా ఏర్పాటు చేశారు. ఈ స్థలంను ప్రజా అవసరాల నిమిత్తం వాడుకొనేందుకు వీలుంటుందన్నారు. ఈ సందర్భంగా టీపీవో భాస్కర్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రభుత్వ స్థలాలు ఎక్కడ కబ్జాకు గురికాకుండా చూసుకోవాలని సూచించారు.

అభివృద్ధికి నిరంతర కృషి

చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి నిరంతరం కృషి చేయడం జరుగుతుందని శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని 9వ వార్డులో నూతనంగా నిర్మించిన పోచమ్మ దేవాలయం వద్ద వేస్తున్న సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చంద్రమౌళి, పీఏసీఎస్ డైరెక్టర్ ఆర్.మహేందర్‌రెడ్డి, మున్సిపల్ టీఆర్‌ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

చీడపీడలు సోకకుండా జాగ్రత్తలు పాటించాలి



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏఓ

కొందుర్గు: పంటలపై చీడపీడలు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి మధుసూదన్ సూచించారు. గురువారం ఆయన మండలంలోని చుక్కమెట్టు గ్రామంలో రైతులు సాగుచేసిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలన్నారు. మొక్కజొన్న పంటకు సుడిపురుగు సోకకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ లక్ష్మికాంత్, రైతులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో ఇబ్బందులు రావొద్దు

- భక్తులకు అన్ని సదుపాయాలు కల్పించాలి
- ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



షాద్‌నగర్ టౌన్: బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్ టౌన్: రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సూచించారు. గురువారం పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఈఓ శ్రీరామశర్మ ఆధ్వర్యంలో రామేశ్వరం బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 14నుంచి 22వ తేదీ వరకు రామేశ్వరం బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంతో పవిత్రమై ఈ పుణ్యక్షేత్రానికి ఇతర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారని, వారికి కావాల్సిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా తాగునీరు, వసతి సౌకర్యం, క్యూలైన్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, ఆలయ చైర్మన్ ప్రభాకర్‌రావు, సర్పంచ్ సంపత్‌కుమార్, సింగిల్ విండో డైరెక్టర్ శ్రీనివాస్, నాయకులు రాఘవేందర్, శేఖర్, గుడ్డు యాదవ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధన కోసం కృషి

కొందుర్గు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. గురువారం జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావుపూలే విగ్రహ ప్రతిష్ఠకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నాడు అంబేడ్కర్ చేసిన కృషి నేడు ముఖ్యమంత్రి కేసీఆర్‌తో తీరుతుందన్నారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలతో ప్రతి పేదవాడికి లబ్ధి చేకూరుతుందన్నారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షులు సయ్యద్ హఫీజ్, నాయకులు బాబురావు, జబ్బార్, రాములు, బాల్‌రాజ్, మానయ్య, స్వామి, గోపాల్ రెడ్డి, రామచంద్రయ్య, శివ, నర్సింగ్‌రావు, నర్సింలు పాల్గొన్నారు.



కొందుర్గు: భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్

మొయినాబాద్: మొయినాబాద్‌లో ట్రాఫిక్ సమస్యలపై రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. బస్టాపుల్లో, రోడ్లపై నిలుపుతున్న వాహనాలపై కొరడా ఝుళిపిస్తున్నారు. గురువారం మొయినాబాద్‌లోని ప్రధాన రహదారిపై పార్కుచేసిన బైకులు, బస్టాపుల్లో నిలిపిన బైక్‌లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మొయినాబాద్ మండల కేంద్రంలోని హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై గత కొంత కాలంగా ట్రాఫిక్ సమస్య తీవ్రమయ్యింది. షాపుల ముందు పార్కింగ్ స్థలం లేకపోవడంతో రోడ్లపైనే వాహనాలు నిలుపుతున్నారు. బస్టాపుల్లో ఆటోలు, బైక్‌లు నిలిపి ట్రాఫిక్ సమస్యను సృష్టిస్తుండడంతో రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు దానిపై ప్రత్యేక దృష్టి సారించారు. వారం రోజులపాటు మొయినాబాద్‌లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తామని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లవకుమార్‌రెడ్డి, ఎస్సై ఇక్బాల్ తెలిపారు. రోడ్లపైన ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలుపవద్దని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వాహనదారులకు అవగాహన కల్పించారు.



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

బీజేపీ నాయకుడి రాజీనామా !

కొత్తూరు: మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన మైలారం రాఘవులు బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడి పదవికి రాజీనామా చేస్తున్నట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో నిర్వహించే పలు కార్యక్రమాలకు పార్టీ సభ్యుడు తనకు ఎలాంటి సమాచారం ఇవ్వని కారణంగా పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఇకనైనా నాయకులు తీరు మార్చుకొని మండలంలో నిర్వహించే సమావేశాలు, కార్యక్రమాలకు సమాచారం ఇస్తే పార్టీలో కొనసాగుతానని లేని పక్షంలో పార్టీ సభ్యత్వానికి కూడా రాజీనామా చేయనున్నట్లు తెలిపారు.

వీఓఏల సమస్యలకు పరిష్కారం చూపండి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న వీఓఏలు

చేవెళ్ల: గ్రామాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలను మహిళ సంఘాల ద్వారా చేరవేసేందుకు వీఓఏలు ఎంతో కృషి చేస్తున్నారని మా సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే కాలె యాదయ్యకు చేవెళ్ల మండల వీఓఏలు విన్నవించారు. గురువారం చేవెళ్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను పరిష్కరించేలా అసెంబ్లీలో ప్రస్తావించాలని ఎమ్మెల్యే కాలె యాదయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో మహిళలతో కలిసి గ్రామ సంఘాలకు పనిచేస్తూ వారికి ప్రభుత్వం అందించే పథకాలను చేరవేస్తున్నట్లు చెప్పారు. కానీ, గ్రామంలో వీఓఏలకు ఎలాంటి గుర్తింపు లేదని కనీస వేతనం, డ్రెస్‌కోడ్ లేదని చెప్పారు. దీంతో పాటు పీఎఎస్, ఈఎస్ఐ లాంటి సౌకర్యాలను కల్పించాలని కోరారు. ఈ సమస్యలను అంసెబ్లీలో ప్రస్తావించి సీఎం దృష్టికి చేరాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో వీఓఏల అధ్యక్షుడు ఎండీ హమ్మద్, కార్యదర్శి స్వరూప, కోశాధికారి జ్యోతి, ప్రమీల, మనీల, చంద్రశేఖర్, రమేశ్, జంగయ్య, కవిత, విజయ, తదితరులు ఉన్నారు.

లోక్ అదాలత్‌లో 82 కేసులు పరిష్కారం

చేవెళ్ల: చేవెళ్లలో ట్రాఫిక్ కేసులపై నిర్వహించిన లోక్ అదాలత్‌లో మొదటిరోజున 82 కేసులు పరిష్కరించినట్లు రిటైర్డు జడ్జి సాంబమూర్తి తెలిపారు. చేవెళ్ల కోర్టు ఆవరణలో గురువారం ప్రారంభించిన లోక్ అదాలత్‌లో ఆయన పాల్గొని చేవెళ్ల డివిజన్ పరిధిలోని చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్ మండలాల పరిధిలోని ట్రాఫిక్ పోలీసులకు సంబంధించిన కేసులు పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు కేసులు పరిష్కరించుకునేందుకు లోక్‌అదాలత్ 10రోజుల పాటు కొనసాగిస్తున్నట్లు చెప్పారు. మొదటిరోజున మూడు మండలాల పరిధిలోని 82 ట్రాఫిక్ పోలీస్‌లకు సంబంధించిన కేసులు పరిష్కరించడం జరిగిందన్నారు. ఈ కేసులకు సంబంధించి 2లక్షల1500ల జరిమానాలు విధించడం జరిగిందని ట్రాఫిక్ సీఐ వాసు తెలిపారు. ఇంకా వారం రోజుల పాటు జరిగే ఈ లోక్ అదాలత్‌ను మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన వారు, డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ కార్డులు లేని వారు ట్రాఫిక్ పోలీసులకు చిక్కిన కేసులను ఈ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని చెప్పారు. సంబంధిత కేసులు నమోదైన వారికి ట్రాఫిక్ పోలీసులు సమాచారం అందిస్తున్నామని ఇంకా ఎవరికైనా సమాచారం లేకపోయిన వారు నేరుగా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి కేసులు తెలుసుకొని పరిష్కరించుకోవాలని సూచించారు.



లోక్ అదాలత్‌లో రిటైర్డు జడ్జి సాంబమూర్తి, ట్రాఫిక్ సీఐ వాసు, బాధితులు

రూ.11.70 కోట్లతో మండల అభివృద్ధి



నిధుల ప్రొసీడింగ్ కాపీలను సర్పంచ్‌లకు అందజేస్తున్న అవినాశ్‌రెడ్డి

జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి

చేవెళ్ల: అధిక నిధులు తీసుకువచ్చి జిల్లాలోనే షాబాద్ మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతామని జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం షాబాద్ మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో అన్ని గ్రామాల సర్పంచ్‌లకు నిధుల ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. అనంతరం వివిధ సర్పంచ్‌లు జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డిని పూలమాలలు, శాలువాలు, బోకేలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రభుత్వ నిధులతో గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. మండలంలోని వివిధ అభివృద్ధి పనులకు రూ.11.70 కోట్లు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. మండలంలో సమస్యలు లేని గ్రామాలుగా మారుస్తామని చెప్పారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు, సీసీ రోడ్లు నిర్మాణం, విద్యుత్ సమస్యలు పరిష్కరానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాతనే గ్రామాలన్నీ అభివృద్ధి చెందాయన్నారు. అన్ని గ్రామాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ శేఖర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నక్క శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు తదితరులున్నారు.

లేగదూడలకు బ్రూసెల్లా టీకాలు

పశువైద్యాధికారులు స్రవంతి, చంద్రశేఖర్‌రెడ్డి

చేవెళ్ల: లేగదూడలకు బ్రూసెల్లా వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు డాక్టర్ స్రవంతి, డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని దామర్లపల్లి, నాన్‌దార్‌ఖాన్‌పేట్, మన్‌మర్రి, బోడంపహాడ్ తదితర గ్రామాల్లో సిబ్బందితో కలిసి లేగదూడలకు బ్రూసెల్లా వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పశువుల ఆరోగ్యం పట్ల రైతుల జాగ్రత్తలు పాటించాలని సూచించారు. 4–8 నెలల వయస్సు కలిగిన లేగదూడలకు పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో బ్రూసెల్లా వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, రైతులు తదితరులున్నారు.

రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే గెలుపు

జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి



ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షులు జీ.రుద్రరాజును కలిసిన కాంగ్రెస్ జిల్లా నాయకులు

చేవెళ్ల: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పామెన భార్గవరామ్ అన్నారు. గురువారం నగరంలో ఇందిరా భవనంలో ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షుడు జీ.రుద్రరాజును కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పామెన భార్గవరామ్‌లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జూడో పాదయాత్రకు అపూర్వ స్పందన వస్తుందన్నారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. భారతదేశంలో బీజేపీ ప్రభుత్వం పరిపాలనలో అన్ని ఇబ్బందులు ఉన్నాయని, కులమతాల చిచ్చుపెట్టి బీజేపీ ప్రభుత్వం పరిపాలన సాగిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపాల్, సుదర్శన్, ప్రభాకర్, రవీందర్ తదితరులున్నారు.

వరి పంట పరిశీలన



వరి పరిశోధన శాస్త్రవేత్తలు క్రిష్ణ, చంద్రమోహన్

చేవెళ్ల: తాలుపోయిన వరి పంటను పరిశీలించి రెండు, మూడు రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని రాజేంద్రనగర్ వరి పరిశోధన శాస్త్రవేత్తలు డాక్టర్ ఎల్.క్రిష్ణ, డాక్టర్ వై. చంద్రమోహన్ పేర్కొన్నారు. గురువారం పోతుగల్ తండాకు చెందిన కిషన్‌నాయక్ సాగు చేసిన వరి పంటను వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. వానాకాలం సీజన్‌లో సాగు చేసిన బయోజీన్ కంపెనీకి చెందిన గంగోత్రి రకం వరి పంట గింజ పట్టక మొత్తం తాలు పోయిందని రైతులు ఫిర్యాదు చేశారని చెప్పారు. శాస్త్రవేత్తలు, రైతును సాగు చేసిన పంట నాటిన తేదీ వివరాలు, ఎరువుల వాడకం, పురుగు మందులు శిలీంద్ర నాశనుల వాడకం వివరాలు తెలుకుని పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు తెలిపారు. త్వరలో నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఓ వెంకటేశం, ఏఈఓ కిరణ్మయి, బయోజీన్ కంపెని ఫీల్డ్ ఆఫీసర్ రమేష్‌బాబు, కేజే ఫర్టిలైజర్ షాప్ యాజమాని శ్రీనివాస్‌రెడ్డి, రైతులు కిషన్‌నాయక్, రవీందర్‌నాయక్ తదితరులున్నారు.

ఘనంగా నిరంకారీ సంత్ సమాగం



సంత్‌సమాగంలో పాల్గొన్న సుదీక్షజీ మహారాజ్

చేవెళ్ల: ప్రతి ఒక్కరు శాంతియుతంగా సత్యమార్గంలో నడవాలని సంత్ నిరంకారీ పరమపూజ్య సద్గురు సుదీక్షజీ మహారాజ్ అన్నారు. గురువారం సాయంత్రం మండల కేంద్రంలోని సంత్‌నిరంకారీ నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు భక్తులనుద్దేశించి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు భక్తి మార్గంలో నడువాలన్నారు. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరు భక్తి భావంతో ఉంటూ జ్ఞానం సంపాదించుకోవాలన్నారు. అంతా కలిసి మెలిసి జీవిస్తూ ఎలాంటి అహంకారాలు, అంహభావాలకు పోవద్దన్నారు. బ్రహ్మజ్ఞానం పొందటానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి. ఈ నిరంకారీలో మమేకమై జీవించే వారే నిజంమైన నిరంకారీలని చెప్పారు. ప్రజలు ఎలాంటి మూఢనమ్మకాలను నమ్మవద్దని ఎలాంటి భ్రమలో పడవద్దన్నారు. పరమాత్మని గుర్తించి భక్తిభావంతో మెలుగాలన్నారు. మనస్సులో ఎలాంటి ద్వేషాలు పెట్టుకోకుండా ప్రశాంతంగా మనస్సు పెట్టుకోవాలన్నారు. ఈ సంత్‌సమాగంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్యే కేఎస్. రత్నం, ఎంపీపీ విజయలక్ష్మి, జెడ్పీటీసీ, మాలతి. చేవెళ్ల మండల సత్సంగ్ అధ్యక్షుడు దశరథ్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటరెడ్డి, చేవెళ్ల సర్పంచ్ బండారు శైలజ, కేసారం సర్పంచ్ రమేశ్‌గౌడ్, నాయకులు రాంచంద్రయ్య, మధుసుదన్‌గుప్తా, శ్రీనివాస్‌గౌడ్, సత్సంగ్ సభ్యులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించొద్దు

రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ పార్టీల నేతలు

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని పరిరక్షించుకుందామని వివిధ పార్టీల, సంఘాల నేతలు అన్నారు. గురువారం పట్టణంలోని సాయికృష్ణ ఫంక్షన్ హాల్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్, బీజేపీ, వైఎస్‌ఆర్‌సీపీ, బీఎస్పీ, సీపీఎం పార్టీల నేతలతో పాటుగా, వివిధ సంఘాల నేతల పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాత జాతీయ రహదారి విస్తరణలో భాగంగా షాద్‌నగర్ పట్టణ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించొద్దన్నారు. తప్పని పరిస్థితుల్లో విగ్రహాన్ని తొలగించాల్సి వస్తే చౌరస్తాలో సర్కిల్ ఏర్పాటు చేసి మధ్యలో అంబేడ్కర్ విగ్రహం పెట్టాలని డిమాండ్ చేశారు. పట్టణ అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, అంబేడ్కర్ విగ్రహాన్ని మాత్రం అక్కడే ఉంచాలన్నారు. వివిధ పార్టీ నేతలు శంకర్, శ్రీవర్ధన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాంబల్ నాయక్, సిద్దార్థ, మోహన్‌సింగ్, కృష్ణయ్య, రామకృష్ణ, శ్రీనివాస్, రవి, పాల్గొన్నారు.



ఐక్యత చాటుతున్న వివిధ పార్టీల నేతలు

పేదల జీవితాల్లో 'కంటి వెలుగు'

చేవెళ్ల: 'కంటివెలుగు'తో పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని సర్పంచ్ గాయత్రి, ఎంపీటీసీ కావలి సుజాతలు అన్నారు. మండలంలోని కౌకుంట్ల గ్రామంలో గురువారం కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలోని పేదలంతా ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కంటి సమస్యలు ఉన్న వాళ్ల పరీక్షలు చేసుకుంటే కావాల్సిన వారికి అద్దాలు ఇస్తారని తెలిపారు.కంటి ఆపరేషన్‌లు అవసరం ఉన్న వారికి సరోజినిదేవి కంటి ఆస్పత్రికి రిఫర్ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అబ్దుల్ ఇనాయత్, పంచాయతీ కార్యదర్శి దేవేందర్, డాక్టర్ సుష్మిత, అప్తల్మిక్ ఆఫీసర్ సౌందర్య, సీనియర్ నాయకులు గోపాలక్రిష్ణ, వెంకటేశ్‌బాబు, వార్డు సభ్యులు వసంత, మహేందర్, గౌస్, వాహబ్, శివ, ఏఎన్‌ఎం చంద్రకళ, ఆశవర్కర్లు పాల్గొన్నారు.



చేవెళ్ల: కంటి అద్దాలను అందజేస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ తదితరులు

అంధ రహిత సమాజమే లక్ష్యం

మొయినాబాద్: అంధ రహిత సమాజం కోసం 'కంటి వెలుగు' పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతుందని సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు, పెద్దమంగళారం సర్పంచ్ కోట్ల నరోత్తంరెడ్డి అన్నారు. మండల పరిధిలోని పెద్దమంగళారంలో గురువారం కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు పైబడినవారంతా కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కంటివెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి వాణి, సీహెచ్‌ఓ నర్సింగ్‌రావు, హెల్త్ సూపర్‌వైజర్లు సునీత, వెంకటయ్య, ఆరోగ్య కార్యకర్తలు శోభ, ప్రమీల, సునీత, శిరీష, దుర్గ, ఆశ కార్యకర్తలు సునీత, విమల, అమృత, సుమలత, నాయకులు హన్మంత్‌యాదవ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



మొయినాబాద్: కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలిస్తున్న నరోత్తంరెడ్డి